క్లుప్తంగా

ఈవీఎంల పరిశీలన



ఫిరంగిపురం: మండలంలోని రేపూడి వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈవీఎంలు భద్రపరచిన గోడౌన్లను జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి మంగళవారం పరిశీలించారు. సీసీ కెమెరాలు, ఈవీఎంలు భద్రపరచిన గది, బ్యాటరీ ఏర్పాటు చేసిన గదిని పరిశీలించారు. రేపూడి రక్షిత నీటి పథకం ద్వారా కొద్దిరోజులుగా నీరు వదలకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ వేణుగోపాలరెడ్డి దృష్టికి వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కొమ్మారెడ్డి చిన్నప్పరెడ్డి తీసుకువచ్చారు. స్పందించిన కలెక్టర్ సంబంధితశాఖ ఎస్ఈతో మాట్లాడారు. నీటిసమస్య ఇంత తీవ్రంగా ఉంటే అధికారులు ఏమి చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరువులో నీరు నింపుకోలేకపోవడం గురించి విచారించారు. సమస్యను మూడురోజుల్లో పరిష్కరించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ పద్మనాభుడు, అధికారులు ఉన్నారు.

కేఎల్‌యూ విద్యార్థికి అంతర్జాతీయ అవార్డు



తాడేపల్లిరూరల్: యూఎస్ఏకి చెందిన ఎన్విరాన్‌మెంట్ మ్యూటాజెనిసిస్ అండ్ జెనోమిక్స్ సొసైటీ అవార్డుకు వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీలో బయో టెక్నాలజీ న్యూరో సైన్స్‌లో పరిశోధనా విద్యార్థిని లక్ష్మీసౌమ్య ఎంపికైందని విశ్వవిద్యాలయ ప్రొ చాన్స్‌లర్ డాక్టర్ కేఎస్ జగన్నాధరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చికాగోలో సెప్టెంబర్ 9, 13 తేదీల్లో జరిగే కార్యక్రమంలో లక్ష్మీసౌమ్య న్యూరో సైన్స్ పైన చేసిన పరిశోధనా పత్రాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ, ప్రొ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు తదితరులు లక్ష్మీసౌమ్యను అభినందించారు.

రజక జన సేవా సంఘం కార్యవర్గం ఎన్నిక

మంగళగిరి: రజక జన సేవా సంఘం పట్టణ కమిటీ ఎన్నిక మంగళవారం నగరంలోని ఆర్య వైశ్య కల్యాణ మండపంలో జరిగింది. పట్టణ రజక జన సేవా సంఘం అధ్యక్షునిగా కానుగంటి శ్రీనివాసరావు, కార్యదర్శిగా రాచకొండ శ్రీనివాసరావు, కోశాధికారిగా నీలం శ్రీకృష్ణ, ఉపాధ్యక్షునిగా ముదిగొండ శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీగా కంభాల పూర్ణశేఖర్, సహాయ కార్యదర్శులుగా తంగెళ్లపల్లి వెంకటేశ్వరరావు, దారాజుల చంద్రలను ఎన్నుకున్నారు. రాష్ట్ర రజక జన సేవా సంఘం ప్రధానకార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ రజకులపై జరుగుతున్న దాడులను ఐకమత్యంగా ఎదుర్కొని అరికట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని, ప్రభుత్వ ఉద్యోగాల్లో రజకులకు రిజర్వేషన్ కల్పించడంతో పాటు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రజక సంఘ నాయకులు నూతక్కి ఏడుకొండలు, యు శేషగిరిరావు, గుంటూరు శివయ్య తదితరులు పాల్గొన్నారు.

డెంగీ వ్యాధి నిర్మూలనకు సమష్టి కృషి అవసరం



తాడేపల్లిరూరల్: డెంగీ వ్యాధి నిర్మూలనకు మనందరి సమష్టి కృషి అవసరమని దుగ్గిరాల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి అబ్దుల్ రెహమాన్ అన్నారు. మంగళవారం డెంగీ వ్యాధి నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశాన్ని డెంగీ రహిత దేశంగా ప్రజలందరికి సహకారంతో చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కడా మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. సహాయ మలేరియా అధికారి పున్నారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో సీహెచ్.ఓ. జానమ్మ ఏఎన్ఎంలు బొల్లంపల్లి బుజ్జి, శారద, ఆశ వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యం

తెనాలిరూరల్: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యంపై కేసులు మంగళవారం నమోదయ్యాయి. పోలీసుల కథనం మేరకు పట్టణ సుల్తానాబాద్‌కు చెందిన 53 ఏళ్ల ఆకురాతి శ్రీనివాసరావు ఈ నెల 1వ తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. మారీస్‌పేట సీఎం కాలనీకి చెందిన 31 ఏళ్ల రమడి ఈశ్వరరావు 1వ తేదీన ఇంటి నుంచి వెళ్లి కనబడకుండా పోయాడు. రెండు కేసులనూ నమోదు చేసినట్లు త్రీ టౌన్ ఎస్ఐ ఎం. విజయ్ కుమార్ తెలిపారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వం

- మంగళగిరి నియోజకవర్గ పరిశీలకులు నిమ్మకాయల రాజనారాయణ
- పలుచోట్ల జగనన్న సురక్ష కార్యక్రమం
- పలువురికి సర్టిఫికెట్లు అందజేత



చింతలపూడిలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న మంగళగిరి నియోజకవర్గ పరిశీలకులు నిమ్మకాయల రాజనారాయణ

తాడేపల్లిరూరల్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పేద ప్రజల ప్రభుత్వమని, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ వారి జీవితాల్లో మార్పులు తీసుకువచ్చేందుకు అన్నివిధాలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ పరిశీలకులు నిమ్మకాయల రాజనారాయణ అన్నారు. మంగళవారం దుగ్గిరాల మండలం చింతలపూడి, మోరంపూడి, మంచికలపూడి గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా నిమ్మకాయల రాజనారాయణ, ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణిలు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు ప్రవేశపెట్టి 99 శాతం ప్రజలకు అందజేశారని, ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్న నవరత్నాలను అమలు చేసేందుకు పలు రాష్ట్రాల ప్రభుత్వాలు మన రాష్ట్రంలో పర్యటించి వివరాలు సేకరిస్తున్నాయని అన్నారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేక సంక్షేమ పథకాలు అందని వారి కోసం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆ సమస్యలను జగనన్న సురక్ష కార్యక్రమంలో పరిష్కరిస్తున్నారు. చింతలపూడిలో మొత్తం 541 నివాసాలు ఉండగా, 236 మంది వివిధ రకాల పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నారని, వాటిని పరిష్కరించి జగనన్న సురక్ష కార్యక్రమంలో మరో 12 సమస్యలను పరిష్కరించామని తెలిపారు. మోరంపూడి, మంచికలపూడి సచివాలయాల పరిధిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ మోరంపూడి, మంచికలపూడిలో మొత్తం 1761 నివాసాలు ఉండగా జగనన్న సురక్ష కార్యక్రమంలో 381 దరఖాస్తులు స్వీకరించగా, అందులో 349 దరఖాస్తులను అధికారులు పరిష్కరించి పత్రాలు అందజేశారని, వీటిలో కొన్ని సరైన పత్రాలు లేక అధికారులు పరిష్కరించలేకపోయామని, వాటిని కూడా త్వరలో పరిష్కరిస్తారని తెలిపారు. జగనన్న సురక్ష కేంద్రాల్లో హెల్ప్ డెస్కులతో పాటు ఆరోగ్య కేంద్రాలను కూడా ఏర్పాటు చేశారు. జగనన్న సురక్ష కేంద్రాల్లో మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు 125వ జయంతి వేడుకలను నిర్వహించి ఆయన చిత్రాపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లేశ్వరి, ఎంపీడీఓ కుసుమ శ్రీదేవి, డిప్యూటీ తహసీల్దార్ రమేష్, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు (డీవీఆర్) మోరంపూడి సర్పంచ్ ఇత్తడి రమేష్, ఎంపీటీసీ సభ్యుడు కూచిపూడి సురేష్, చింతలపూడి సర్పంచ్ తాడిబోయిన రామకృష్ణ, మంచికలపూడి సర్పంచ్ యార్లగడ్డ శ్రీచంద్ర దుర్గాభవాని, మాజీ సర్పంచ్ నల్లనూకల కోటి యాదవ్, పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న తాడేపల్లి తహసీల్దార్ మర్రిరెడ్డి నాగిరెడ్డి

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఉండవల్లిలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తాడేపల్లి తహసీల్దార్ మర్రెడ్డి నాగిరెడ్డి మాట్లాడుతూ 11 రకాల సేవలను జగనన్న సురక్ష కార్యక్రమంలో అందజేస్తున్నారని తెలిపారు. ఉండవల్లిలో 1470 మంది దరఖాస్తులు అందజేశారని వాటిని పరిశీలించి వారికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందజేశామని తెలిపారు. ఆధార్ సమస్యలతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించేందుకు హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేశామని, ప్రతి శాఖకు సంబంధించిన అధికారులు ఉంటారని, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరిస్తుండగా, కొన్నింటిని ఎప్పటికి పరిష్కారమవుతాయో తెలియజేస్తున్నారని తెలిపారు. కౌలు రైతులకు కార్డులను కూడా ఈ కార్యక్రమంలో అందజేస్తామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ శ్రీనివాసరావు, కార్పొరేషన్ డీఈ రహీమ్, ఆర్ఐ ప్రశాంతి, ఆర్వో మురళి, ఏఈ కిషోర్, గృహసారథులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రావెల(తాడికొండ): ప్రతి పేదవాడికి సంక్షేమం, ప్రభుత్వ పాలనను చేరువ చేసేందుకే సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జగనన్న సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టారని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. తాడికొండ మండలం రావెల గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సర్పంచ్ రావెల శైలజతో కలిసి లబ్దిదారులకు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్ల శ్రీనివాసరెడ్డి, ఉప సర్పంచ్ దేవి, మాజీ ఎంపీపీ కొమ్మినేని రామచంద్రరావు, మాజీ సర్పంచ్ దేవరపల్లి చినపాములు, కొలుపుల ఇన్నారెడ్డి, ఎంపీడీవో అత్తోట దీప్తి, డిప్యూటీ తహసీల్దార్ కాకుమాను ప్రసాద్ పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

■ **అనంతవరం గ్రామంలో...**

అనంతవరం గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ పాల్గొని లబ్ధిదారులకు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ బండి ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు కొప్పుల శేషగిరిరావు, ఆరేపల్లి జోజి, బండ్ల శ్రీకాంత్, పోలు రమేష్, ఎంపీడీవో శివనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిరూరల్: సంక్షేమ పథకాలు అందడం లేదని ఏ ఒక్క కుటుంబం కూడా నిరాశ చెందకూడదని, ప్రతి లబ్ధిదారుడిని గుర్తించి వారికి సంక్షేమ పథకాలు అందించాలని గృహసారథుల జేసీఎస్ కన్వీనర్ ఈదులమూడి డేవిడ్‌రాజు అన్నారు. మంగళవారం 7వ సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి, ఎంఎల్‌ఓ షణ్ముఖ్, సచివాలయాల కన్వీనర్లు అడిపి యాకోబు, మాలపోలు శ్రీకాంత్, కూరపాటి హేమలత, గృహసారథులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

మేడికొండూరు: రాష్ట్రంలో ప్రజలకు మెరుగైన సుపరిపాలన అందించడమే వైఎస్సార్ సీపీ లక్ష్యమని ఆ పార్టీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. మేడికొండూరు మండలం మంగళగిరిపాడు, పాలడుగు గ్రామాలలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మన్నవ స్వప్న, మంగళగిరిపాడు గ్రామ సర్పంచ్ షేక్ రబ్బాని, పాలడుగు గ్రామ సర్పంచ్ వాడపర్తి భారతి, జేసీఎస్ కన్వీనర్ అబ్బాస్, మహిళా అధ్యక్షురాలు, ఎంపీడీఓ కె ప్రభాకరరావు, తహసీల్దార్ శ్రీనివాసశర్మ తదితరులు పాల్గొన్నారు.

బూటకపు హామీలు నమ్మొద్దు

ఫిరంగిపురం: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఇస్తున్న బూటకపు హామీలు నమ్మొద్దని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని సొలస బస్టాండు సెంటర్‌లోని సాయినాథ కల్యాణ మండపంలో మంగళవారం జగనన్న సురక్షపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఫిరంగిపురం-3 సచివాలయ పరిధిలో సచివాలయ సిబ్బంది ఇంటింటికి తిరిగి 520మంది సమస్యలు ఉన్నవారిని గుర్తించి వారికి టోకెన్లు అందజేశారు. అందులో అర్హులైన వారిని గుర్తించి వారికి జగనన్న సురక్ష ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న 11 రకాల సేవలు అందించనున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా సిబ్బందితో శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని కత్తెర సురేష్‌కుమార్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ ప్రభుత్వం చేపట్టని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలు ఇబ్బందులు తొలగించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టారని చెప్పారు. జగనన్న సురక్షలో భాగంగా సచివాలయం సిబ్బంది, వలంటీర్లు ప్రజల ఇళ్లకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకొని టోకెన్లు ఇచ్చి పత్రాలు అందజేస్తారన్నారు. ప్రభుత్వం ప్రకటించిన 11 రకాల సేవలకు సంబంధించి పత్రాలు ఒక్క పైసా ఖర్చుచేయకుండానే ఉచితంగా అందజేస్తారని చెప్పారు. చంద్రబాబు తన 14ఏళ్ల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదని, ఎన్నికలు వస్తున్న తరుణంలో ఇంటికి మూడు సిలిండర్లు ఇస్తాం, లక్షాధికారులను చేస్తాం, రైతులకు రూ.20 వేలు ఇస్తాం అంటూ బూటకపు హామీలు ఇస్తున్నాడన్నారు. వాటిని ప్రజలు నమ్మరని చెప్పారు. అనంతరం పలువురికి 11 రకాల సేవలకు సంబంధించిన పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, ఎంపీపీ షేక్ షహేలా నర్గీస్, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, కె.చిన్నప్పరెడ్డి, చిట్టా అంజిరెడ్డి, పి.జేమ్స్ ఇన్నయ్య, పి.మరియబాబు, నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఎం.వెంకట్రామిరెడ్డి, ప్రత్యేకాధికారి యుగంధర్‌కుమార్, డీఎల్‌డీవో సుజాత, తహసీల్దార్ పద్మనాభుడు, ఈవోపీఆర్డీ నిర్మలాలక్ష్మీకుమారి, సర్పంచ్ మేడా బాబు, వై.రమాదేవి, ఇన్‌చార్జి కార్యదర్శి కె.విష్ణువర్ధన్‌రావు, బి.మధు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

ల్యాబ్ అసోసియేషన్ సేవలు వెలకట్టలేనివి

డీఎంహెచ్ఓ డాక్టర్ ఎ.శ్రావణబాబు



మంగళగిరి: వెనుకబడిన తరగతుల విద్యార్థుల వసతి గృహాల అభ్యున్నతికి ల్యాబ్ అసోసియేషన్ అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎ శ్రావణబాబు అన్నారు. గుంటూరు జిల్లా ల్యాబ్ ఎక్స్‌రే ఓనర్స్ అసోసియేషన్ నేతృత్వంలో మంగళగిరి మెడికల్ లేబొరేటరీ టెక్నీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నవులూరు ఏసీఏ క్రికెట్ స్టేడియం సమీపంలోని వెనుకబడిన తరగతుల విద్యార్థుల వసతి గృహానికి కల్పించిన మౌలిక వసతులను మంగళవారం డీఎంహెచ్ఓ దంపతులు పరిశీలించారు. వారు మాట్లాడుతూ అభివృద్ధి అంటే మనం మాత్రమే అభివృద్ధి చెందడం కాదని, సమాజంలో అన్ని వర్గాల వారిని అభివృద్ధిలోకి నడిపిన నాడే నిజమైన అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో స్టేట్ సెక్రటరీ శర్మ, ఉపాధ్యక్షులు వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు ఆనం సంజీవరెడ్డి, సెక్రటరీ శ్రీహరి, రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

బాప్తిజం ఘాట్ నిర్మాణానికి ఆటంకం కలిగిస్తే ఊరుకోం

పాస్టర్స్ ఫెలోషిప్ నియోజకవర్గ అధ్యక్షుడు తిమోతి

మంగళగిరి: నగరంలో క్రైస్తవుల సౌకర్యార్థం నిర్మించతలపెట్టిన బాప్తిజం ఘాట్ నిర్మాణానికి ఆటంకం కలిగిస్తే చూస్తూ ఊరుకునేది లేదని పాస్టర్స్ ఫెలోషిప్ నియోజకవర్గ అధ్యక్షుడు పి తిమోతి అన్నారు. తెనాలి రోడ్డులోని గుంటూరు చానల్ వెంబడి ప్రభుత్వ స్థలంలో నిర్మితమవుతున్న బాప్తిజం ఘాట్ నిర్మాణాన్ని బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతలు సోమవారం అడ్డుకోగా వారిని పోలీసులు అరెస్ట్ చేసిన విషయం విదితమే. మంగళగవారం పాస్టర్స్ ఫెలోషిప్ మంగళగిరి నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు నగరంలోని ఐబీఎన్ భవన్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాస్టర్ తిమోతి మాట్లాడుతూ నీతిగా బతకడానికి పుణ్యస్నానం ఆచరించడమే బాప్తిజం అని అన్నారు. దీనికి మత మార్పిడి అని పేరు పెట్టి క్రైస్తవ సమాజాన్ని అవమానించడం తగదన్నారు. నదులు, కాలువల వద్ద బాప్తిజం స్వీకరణ వల్ల పలు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. క్రైస్తవులు పడే ఇబ్బందిని గమనించి బాప్తిజం ఘాట్ నిర్మించాలని ఎమ్మెల్యే ఆర్కేను కోరగా ప్రభుత్వ స్థలాన్ని చట్ట ప్రకారం కేటాయించారన్నారు. బీజేపీ నేతలు అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమన్నారు.

రాజకీయ చరిత్ర ఉన్న నాయకులు వైఎస్సార్, వీఎంఆర్

- వైఎస్సార్, వంగవీటిల విగ్రహాల ఆవిష్కరణ
- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి



దివంగత నేత డాక్టర్ రాజశేఖరరెడ్డి, వంగవీటి విగ్రహాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

తాడేపల్లిరూరల్: రాజకీయ చరిత్ర ఉన్న మహానాయకులు దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, వంగవీటి మోహనరంగా అని, వారి విగ్రహాలను ఆవిష్కరించడం ఎంతో ఆనందించదగ్గ విషయమని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం కుంచనపల్లి వద్ద ప్రాతూరు నూతక్కి రోడ్డులో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, వంగవీటి మోహనరంగా విగ్రహాలను, ముఖద్వారాన్ని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి ఆవిష్కరించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ ప్రజా నాయకుడు వంగవీటి మోహనరంగా జయంతి రోజు విగ్రహాలను ఆవిష్కరించడం ఎంతో సంతోషించదగ్గ విషయమని అన్నారు. వీరిద్దరూ పేద ప్రజల అభ్యున్నతి కోసం, వారి సమస్యల కోసం పోరాడిన మహా నాయకులు అని పేర్కొన్నారు. వంగవీటి మోహనరంగా ఎమ్మెల్యేగా ఉంటూ పేద ప్రజల ఇబ్బందులను గమనించి వారి సమస్యలను పరిష్కరించారని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేదల సంక్షేమం కోసం పనిచేసిన మహానేత అని, ఈ ప్రాంతంలో ప్రజల కోరిక మేరకు వీరి విగ్రహాలను ఏర్పాటు చేశామని, నూతక్కి నుంచి ప్రాతూరు వెళ్లే ఈ రహదారిలో ముఖద్వారాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలసోమిరెడ్డి, గృహసారథుల జేసీఎస్ కన్వీనర్ ఈదులమూడి డేవిడ్‌రాజు, కుంచనపల్లి పార్టీ కన్వీనర్ మిరియాల రాంబాబు, మాజీ వైస్ ప్రెసిడెంట్ అమరానాగయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రెడ్డిబత్తుల సత్యనారాయణరెడ్డి, కొలనుకొండ పార్టీ కన్వీనర్ నూతక్కి శ్రీను, కుంచనపల్లి వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ సర్పంచ్ చిలకయ్య, చాగంటి వెంకటరెడ్డి, దొంతిరెడ్డి తిరుమలరెడ్డి, డేవిడ్, కూరపాటి సాంబిరెడ్డి, మాజీ సొసైటీ ప్రెసిడెంట్ శివనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లి వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మహానాడులో మంగళవారం వంగవీటి మోహనరంగా జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా తాడేపల్లి పార్టీ నాయకులు మహానాడు 11వ రోడ్డులో ఉన్న మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, వంగవీటి మోహనరంగాల విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కటింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ కన్వీనర్ మేడా వెంకటేశ్వరరావు (పండు), జిల్లా ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి చిన్నపోతుల దుర్గారావు, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ మేకా వెంకటరామిరెడ్డి, పట్టణ మహిళా కన్వీనర్ అప్పికట్ల సంపూర్ణ పార్వతి, సయ్యద్ సలాం, భూపతి శివ, నాగు, కిషోర్, పజ్జూరి శ్రీనివాస్, యస్‌వై నాయుడు, షేక్ జరీనా తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల గ్రామంలో అంగవైకల్యంతో, అనారోగ్యంతో బాధపడుతున్న వంగధార రామాంజనేయులు, నాగమల్లేశ్వరి దంపతులకు మంగళవారం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. దంపతులకు ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణలు మంగళవారం రూ.20 వేలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు షేక్ నాగూర్, బాజీ, కర్ర్యారావు, సలీం తదితరులు పాల్గొన్నారు.

వివేకా, రంగాలకు నివాళి

తాడేపల్లిరూరల్: మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో ఇప్పటంలో వంగవీటి మోహనరంగా జయంతి, స్వామి వివేకానంద వర్ధంతి కార్యక్రమాలను మంగళవారం గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇప్పటంలో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, వంగవీటి మోహనరంగా కల్యాణ మండపం వద్ద గల గౌతు లచ్చన్న, డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, వంగవీటి మోహనరంగా, చాకలి ఐలమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఇప్పటం గ్రామ శివారులో వున్న స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో లచ్చి తులసీదాసు, మోదుగుల బ్రహ్మారెడ్డి, మున్నంగి సంజీవరెడ్డి, లచ్చి వెంకటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెనాలిలో ఎడతెరిపి లేని వర్షం

తెనాలిఅర్బన్: తెనాలిలో సోమవారం సాయంత్రం నుంచి ఎడతెరిపిలేని వర్షం కురిసింది. గాలులతో కూడిన వర్షం మంగళవారం మధ్యాహ్నం వరకు పడుతునే ఉంది. పట్టణంలోని దాదాపు అన్ని రోడ్లు జలమయమయ్యాయి. వాహనదారులు కొంత ఇబ్బంది పడ్డారు. మంగళవారం ఉదయం విద్యార్థులు, ఉద్యోగులు అవస్థలు పడ్డారు.

అల్లూరి సీతారామరాజు సేవలు చిరస్మరణీయం



అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు



అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బెటాలియన్ అధికారులు

ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు

మంగళగిరి: భారత స్వాతంత్ర్య చరిత్రలో అల్లూరి సీతారామరాజు మహోజ్వల శక్తి అని, ఆయన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు కొనియాడారు. విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా నగరంలోని నగర పాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ తనను నమ్ముకున్న ప్రజల కోసం ప్రాణత్యాగం చేసి అల్లూరి సీతారామరాజు భారతదేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ యు శారదాదేవి, అడిషనల్ కమిషనర్ హేమమాలిని, ఎస్ఈ శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు డీసీపీ మహాలక్ష్మి దొర, ఏసీపీ వెంకటేశ్వర్లు, డీఈ కృష్ణారెడ్డి, పలువురు నగర పాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీఎస్పీ ఆరో బెటాలియన్‌లో...

నగరంలోని ఏపీఎస్పీ ఆరో బెటాలియన్ ఆవరణలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ ఈఎస్ సాయిప్రసాద్, అసిస్టెంట్ కమాండెంట్‌లు శ్రీనివాస బాబ్జి, మల్లికార్జునరావు, టీఎస్పీ మురళీకృష్ణ, హనుమంతు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో...

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను నిర్వహించారు. తహసీల్దార్ ఎం.నాగిరెడ్డి అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎన్.సతీష్, ఆర్ఐ వంశీ, ప్రశాంతి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో...

మంగళగిరి తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ సాంబశివరావు, సూపరింటెండెంట్ దినకర్ బాబులతో పాటు పలువురు కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాటూరికి గురుసత్కారం

తెనాలి: గురుపౌర్ణమి సందర్భంగా విజయవాడలోని సంస్కార భారతి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నిర్వహించిన గురుపూజ మహోత్సవంలో తెనాలికి చెందిన ప్రముఖ శిల్పకారుడు కాటూరి వెంకటేశ్వరరావును ఘనంగా సత్కరించారు. శిల్పకళలో వివిధ ప్రక్రియల్లో రకరకాల శిల్పాలను తయారుచేస్తూ ఖండాంతర ఖ్యాతిని సాధించినందుకు సత్కరించినట్లు తెలిపారు.

విద్యార్థుల ఉన్నతికి జగన్ బాటలు

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త సురేష్‌కుమార్



చెక్కు అందజేస్తున్న సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యురాలు కత్తిరేణమ్మ

ఫిరంగిపురం: విద్యార్థులు ఉన్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాటలు వేస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెరసురేష్‌కుమార్ అన్నారు. మండల విద్యా శాఖ ఆధ్వర్యాన మంగళవారం స్థానిక సెయింట్ పాల్స్ హైస్కూల్ ఆడిటోరియంలో జగనన్న అమ్మ ఒడి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కత్తెర సురేష్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బడుగు, బలహీనవర్గాలకు చెందిన పిల్లలకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల ఉన్నతి కోసం పలు పథకాలు ప్రవేశపెట్టారన్నారు. నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చి కార్పొరేట్‌ను తలదన్నేరీతిలో తీర్చిదిద్దారని అన్నారు. విద్యార్థులు ఉన్నత చదువుల కోసం ఇతర దేశాలు వెళ్లేందుకు పూర్తి భరోసా ఇస్తున్నాడన్నారు. కార్యక్రమానికి ముందుగా సెయింట్‌ఆన్స్ తెలుగు మీడియం పాఠశాల విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ పాలనపై గీతాలు ఆలపించారు. జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, ఎంపీపీ షేక్ షహేలానర్గీస్, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, సర్పంచ్ మేడా బాబు, పాలపాటి రఘు, డిప్యూటీ డీఈవో వెంకటేశ్వరరావు, ఎంఈఓలు మహబూబ్ సుభాని, రవికాంత్, హెచ్ఎం శౌరయ్య, వట్టి థెరసమ్మ, ఎస్.నాగరాజు, డి.నరేంద్రకుమార్, పి.చిన్న, దిలీప్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, సీతారామిరెడ్డి, టి.కృష్ణ పాల్గొన్నారు.

ఇద్దరు బైక్ దొంగల అరెస్ట్

తెనాలిరూరల్: అంతరాష్ట్ర బైక్ దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మోటార్ బైక్‌ల చోరీ కేసుల్లో అరెస్టు చేసిన నిందితుల వివరాలను డీఎస్పీ బి.జనార్ధనరావు వెల్లడించారు. పట్టణ నాజరుపేటకు చెందిన షేక్ కరిముల్లా, ఐతానగర్ ఈటీ కాలనీకి చెందిన రహంత్ సాల్మన్ గతంలో పలు మోటార్ బైక్ దొంగతనాల కేసుల్లో నిందితులుగా ఉన్నారు. గత వారం వ్యవధిలో టూ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్, ఆర్టీసీ బస్టాండ్‌ల వద్ద రెండు బైక్‌లు చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదుపై కేసులు నమోదు చేసిన టూ టౌన్ పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి విచారించగా చెరుకుపల్లి, విశాఖపట్నం, పాదిలి ప్రాంతాల్లో మరో మూడు బైక్‌లు చోరీ చేసినట్లు నేరం అంగీకరించారు. వారి వద్ద నుంచి తెనాలిలో చోరీ చేసిన రెండు బైక్‌లతో పాటు ఇతర ప్రాంతాల్లో చోరీ చేసిన మిగిలిన మూడు బైక్‌లను కూడా స్వాధీనం చేసుకున్నారు. మొత్తం ఐదు బైక్‌ల విలువ రూ. 2.50 లక్షలు ఉంటుందని డీఎస్పీ జనార్ధనరావు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసిన సీఐ ఎస్.వెంకట్రావు, ఎస్ఐలు టి. రమేష్ బాబు, పి.నాగేశ్వరరావులను డీఎస్పీ అభినందించారు.